క్లుప్తంగా

కాంగ్రెస్ బలోపేతానికి కృషి



కోస్గి: మండలంలోని లోదిపూర్ గ్రామానికి చెందిన మోహన్‌ను యూత్ కాంగ్రెస్ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ నియామక పత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మోహన్‌ను కొడంగల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు శనివారం సన్మానించి అభినందించారు. తనపై నమ్మకం ఉంచి యూత్ కాంగ్రెస్‌లో సముచిత స్థానం ఇచ్చిన పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలుపుతూ పార్టీ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని మోహన్ పేర్కొన్నారు.

యోగా శిబిరం విజయవంతం చేద్దాం

నారాయణపేట రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21ని పురస్కరించుకుని పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో యోగా శిబిరం నిర్వహిస్తున్నట్లు పతంజలి యోగా సమితి అధ్యక్షుడు సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నుంచి ఈ నెల 21 శుక్రవారం వరకు ప్రతీరోజు ఉదయం 5గంటల నుంచి 7గంటల వరకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. సూర్య నమస్కారాలు, యోగాసనాలు, ప్రణాయామంతో పాటు ఆహార అలవాట్లపై వివరిస్తారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తప్పని సరిగా హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడాకారుడికి ఆర్థికసాయం



కోయిల్‌కొండ: అండర్–19 నేషనల్ స్థాయి పరుగుపందెంలో ప్రథమస్థానం దక్కించుకున్న వింజామూర్ చెందిన క్రీడాకారుడు నర్సింహులుకు గ్రామంలోని పలువురు దాతలు రూ.40వేల ఆర్థిక సాయం శనివారం అందించారు. ఈనెల 18 నుంచి 26వ తేదీ వరకు నేపాల్‌లో జరిగే నేషనల్ పోటీలలో ప్రతిభ కనబర్చి గోల్డ్‌మెడల్ సాధించి గ్రామానికి, దేశానికి మంచిపేరు తీసుకరావాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

క్రీడలు క్రమశిక్షణ పెంపొందిస్తాయి



నవాబుపేట: క్రీడలు యువతలో మంచి క్రమశిక్షణ అలవర్చుకునేలా దోహదపడతాయని తహసీల్దార్ నాన్యనాయక్ తెలిపారు. శనివారం మండలంలోని గురుకుంటలో నేషనల్ అథ్లెట్ బద్రి ఆధ్వర్యంలో నెల రోజుల పాటు సమ్మర్ కోచింగ్ శిబిరం నిర్వహించారు. శనివారం ముగింపు సందర్భంగా తహసీల్దార్, ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, ఎంపీపీ అనంతయ్య హాజరయ్యారు. అనంతరం సమ్మర్ క్యాంపులో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు, బహుమతులు అందించారు.

చిన్నచింతకుంట ఎంఈఓపై ఫిర్యాదు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మద్దూరు ప్రాథమిక పాఠశాలకు చెందిన హెచ్‌ఎం రవీంద్రప్పపై ఇటీవల చిన్నచింతకుంట ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్ దురుసుగా ప్రవర్తించినందుకు చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కె.రవికుమార్ డిమాండ్ చేశారు. వారు శనివారం కలెక్టరేట్‌లోని డీఈఓ రవీందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గత నెల 29న పాఠశాలలో పనులను పర్యవేక్షించేందుకు వెళ్లి అక్కడి హెచ్‌ఎంపై ఎంఈఓ దుర్భాషలాడారని పేర్కొన్నారు. గతంలోనూ ఈయన చిన్నచింతకుంట, కోయిలకొండ మండలాల్లో ఉపాధ్యాయులను అవమానపరిచేలా ప్రవర్తించారన్నారు.

వాహనం బోల్తా

అడ్డాకుల: జాతీయ రహదారిపై మండల కేంద్రం శివారులో రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు ముప్పు తప్పిపోయింది. శంషాబాద్ నుంచి రఘురెడ్డి బొలెరో గూడ్స్ వాహనంలో వాటర్ బాటిళ్లను శనివారం ఉదయం కొత్తకోటకు తీసుకెళ్తున్నాడు. అడ్డాకుల దాటిన తర్వాత పెట్రోల్ బంక్ సమీపంలో వాహనం టైరు పగిలిపోయింది. దీంతో అదుపు తప్పిన కొంత దూరం డివైడర్ పైకి దూసుకెళ్లి బోల్తాపడింది. క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్ రఘురెడ్డి అదృష్టవశాత్తు ఎలాంటి గాయాలు కాకుండా ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డాడు. ట్రాలీలో ఉన్న వాటర్ బాటిళ్లు కిందపడ్డాయి. రోడ్డు నిర్వాహకులు బోల్తాపడిన వాహనాన్ని అక్కడి నుంచి తీశారు. తర్వాత మరో ట్రాలీ ఆటోలో వాటర్ బాటిళ్లను కొత్తకోటకు తరలించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కేసులు

- వ్యాపారులతో టాస్క్‌ఫోర్స్ బృందం సమావేశం
- రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచన



కోస్గిలో వ్యాపారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు



పోలేపల్లి రైతు వేదికలో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

కోస్గి: ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి వ్యాపారులు నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులు, మందులు అమ్మినా వ్యాపార లైసెన్సులు రద్దు చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని టాస్క్‌ఫోర్స్ అధికారులు హెచ్చరించారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖ అధికారుల బృందంతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో కోస్గి, గుండుమాల్ మండలాలకు చెందిన ఫెర్టిలైజర్, సీడ్ వ్యాపారులతో బృందం అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దుకాణాల్లో నిల్వ ఉన్న స్టాక్, స్టాక్ రిజిస్టర్‌లో నమోదైన వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. రైతులు సరుకులు కొనుగోలు చేసిన సమయంలో విధిగా రశీదులు ఇవ్వాలని, పాకింగ్ లేని విత్తనాల విక్రయాలు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఓ రామకృష్ణ, ఎస్‌హెచ్‌ఓ పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

రైతులు నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఓ రామకృష్ణ, ఏఈఓ వినోద్ సూచించారు. ఈ మేరకు శనివారం పోలేపల్లి రైతువేదికలో రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. మార్కెట్‌లో కొందరు వ్యాపారులు నకిలీ విత్తనాలు అమ్ముతూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. రైతులు వ్యవసాయ శాఖ అనుమతులు ఉన్న దుకాణంలోనే విత్తనాలు కొనుగోలు చేయాలని, కొనుగోలుకు సంబంధించి రశీదు తీసుకోవాలన్నారు. పాకింగ్ లేకుండా లూజ్‌గా విక్రయించే విత్తనాలను కొనుగోలు చేయొద్దని సూచించారు. ఎవరైన నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు గుర్తిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. రైతులు ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు నాటుకొని తమ పొలాలను సారవంతం చేసుకోవాలని సూచించారు.

వానాకాల పంటలపై రైతులకు అవగాహన



దమ్‌గాన్‌పూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ శ్రావణ్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..

మద్దూరు: వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో రైతులకు విత్తనాల కొనుగోళ్లు, పంటల సాగు, నకిలీ విత్తనాలు గుర్తింపు తదితర విషయాలపై శనివారం మండల ఏఈఓలు రైతులకు అవగాహన కల్పించారు. అలాగే జిల్లా వ్యవసాయాధికారి జాన్ సుధాకర్, మద్దూరులోని విత్తనాలు, ఎరువుల షాపులను ఏఓ రామక్రిష్ణతో కలిసి పరిశీలించారు. శనివారం సాక్షిలో వచ్చిన 'కొరవడిన అవగాహన' అనే కథనానికి అధికారులు స్పందించారు. దీంతో ఉదయాన్నే మండలంలోని దమ్‌గాన్‌పూర్, పల్లెర్ల, లక్కాయిపల్లి, దోరేపల్లి, హన్మనాయక్‌తండాలో ఏఈఓలు శ్రావణ్‌కుమార్, శివనాయక్, శిరీష, తిరుమలేష్ రైతులకు విత్తనాల కొనుగోలు గురించి వివరించారు. విత్తనాలు వ్యవసాయశాఖ అధీకృత డీలర్ల వద్దే కొనుగోలు చేయాలని, పంట కాలం పూర్తయ్యే వరకు విత్తనాల పాకెట్లను భద్రపరుచుకోవాలని, రాత్రి వేళల్లో గ్రామాలకు వచ్చే వారి వద్ద విత్తనాలు కొనుగోలు చేయరాదని సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని ఫర్టిలైజర్ షాపు యజమానులకు సూచించారు. స్టాక్ రిజిస్టర్లు రోజు వారిగా అప్‌డేట్ చేయాలని డీలర్లను ఆదేశించారు.



మద్దూరులోని మనగ్రోమోర్‌లో తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి జాన్‌సుధాకర్

క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

మరికల్: గ్రామీణ క్రీడాకారుల ప్రయోజనార్థం మరికల్‌లో క్రీడా మైదానం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన మరికల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు శనివారం బహుమతుల ప్రదానం చేశారు. మొదటి విజేత మరికల్ వారియర్స్ రూ. 40 వేలు, రెండో బహుమతి గెలుపొందిన నారాయణపేట అమరేశ్వర జట్టుకు రూ. 30 వేలతో పాటు షీల్డ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారుల విజ్ఞప్తి మేరకు క్రీడా మైదానం అవసరం ఉందని గుర్తించినట్లు తెలిపారు. తనవంతు ప్రయత్నంగా ప్రభుత్వంతో మాట్లాడి మైదానం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. అనంతరం బహుమతులు ఇచ్చిన దాతలు ప్రతిభ ఉన్నత పాఠశాల కరస్పాడెంట్, గొల్ల కృష్ణయ్యలను అభినందించారు. కార్యక్రమంలో సూర్యమోహన్, వీరన్న, కృష్ణయ్య, వినితమ్మ, రాజు, శివ, రవికిరణ్, రాజేష్, అంజిరెడ్డిలు పాల్గొన్నారు.

పార్టీకి నరసింహులుగౌడ్ సేవలు మరువలేం



కేశం నరసింహులుగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అమరచింత: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా, నాయకుడిగా సేవలందించిన కేశం నరసింహులుగౌడ్ సేవలను ఎన్నటికీ కాంగ్రెస్ పార్టీ మరువదని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. రాష్ట్ర టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ తండ్రి నరసింహులుగౌడ్ ప్రథమ వర్ధంతి వేడుకల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఎదుగుదల కోసం కృషి చేసిన నాయకుల్లో నరసింహులుగౌడ్ ఒకరన్నారు. అనంతరం టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్‌తో పాటు ఆయన సోదరులు శ్రీలన్‌గౌడ్, అశోక్‌గౌడ్‌తో పాటు కుటుంబ సభ్యులను కలిసి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయుబ్‌ఖాన్, అరుణ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, పరమేష్, పోసిరిగారి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

బడిబాటను విజయవంతం చేద్దాం



అమరచింతలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు బలరాముడు

అమరచింత: ఈనెల 3 నుంచి 19 వరకు కొనసాగుతున్న బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ కోరారు. బడిబాట కార్యక్రమ నిర్వహణపై శనివారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బడిబాట కార్యక్రమానికి సంబంధించి రోజువారి చేయాల్సిన కార్యక్రమాల గురించి ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు వివరించారు. బడిబయటి పిల్లలను గుర్తించడమే కాకుండా ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధన ఉంటుందన్న విషయాలను విద్యార్థుల తల్లితండ్రులకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు బలరాముడు, ఎంపీఓ నరసింహులు పాల్గొన్నారు.

రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలి



ఆర్‌ఐకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అమరచింత: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా రాజన్న మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు వ్యవసాయ పనులు చేసుకోవాలంటే ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు పర్చాల్సిన అవసరం ఉందన్నారు. 2024 సంవత్సరంలోనే స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సన్నాలకు కాకుండా వరి పండించిన రైతులందరికీ రూ.500 వందల బోనస్ ఇవ్వాలన్నారు. ఫర్టిలైజర్స్ షాప్‌లలో ఈపాస్ యంత్రాల ద్వారానే విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నకిలీ విత్తనాలను అమ్ముతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి రైతులను కాపాడాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్ ఐ వెంకటేష్‌కు అందించారు. కార్యక్రమంలో వెంకటయ్య, చింతలన్న, బాలస్వామి, కురుమన్న, మ హమూద్, భక్తరాజ్, అంజనేయులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందించాలి



సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

మాగనూర్: 2024 ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు 50 శాతం సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం మండల కమిటీ జిల్లా అధ్యక్షుడు భగవంతు అన్నారు. శనివారం వారు స్థానిక రైతులతో కలిసి మాగనూర్ తహసీల్దార్ కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు 50 శాతం సబ్సిడీపై, దళిత, గిరిజన, సన్నకారు రైతులకు ఉచితంగా ఇవ్వాలని కోరారు. పచ్చిరొట్ట విత్తనాలకు సంబంధించి జీలుగ, జనుము విత్తనాలను డిమాండ్‌కు సరపడా పంపిణీ చేయడం లేదన్నారు. డీఏపీ ఎరువులు కూడా మార్కెట్లు అందుబాటులో లేవని, పంటల బీమా అమలు చేస్తూ దానికి అవసరమైన ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. గ్రామ యూనిట్‌గా పంట నష్టాన్ని పరిశీలించి నష్టపరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, రాజు, మల్లేష్, శ్రీనివాసులు, అంజప్ప, శంక్రప్ప, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యం



కోయిల్‌కొండ: అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కనాయపల్లిలో ఆంజనేయ సహిత హరిహరక్షేత్రము పుష్కరోత్సవం కార్యక్రమానికి హాజరై ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరు భక్తిభావంతో మెలగాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతిని రుపేదకు సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని అన్నారు. అనంతరం దమాయపల్లిలో విద్యుత్‌షాక్‌కు గురైన నరేష్‌ను మహబూబ్‌నగర్ ప్రైవేట్ ఆస్పత్రిలో పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట రాజునాయక్, సత్యపాల్‌రెడ్డి, థావుర్యానాయక్, మనోజ్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

వేడుకలకు కార్యాలయాల ముస్తాబు



మరికల్‌లో విద్యుత్ కాంతులతో తహసీల్దార్ కార్యాలయం

మరికల్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల కేంద్రంలో శనివారం ప్రభుత్వ కార్యాలయాలను అధికారులు ముస్తాబు చేశారు. ఆదివారం జరిగే ఆవిర్భావ వేడుకల కోసం తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్ స్టేషన్, గ్రామ పంచాయతీ కార్యాలయాలను విద్యుత్ కాంతులతో సిద్ధం చేశారు.

మాగనూర్: జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జైపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలో సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీడీఓ కార్యాలయంలో 11వ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆదివారం ఉదయం 8:35 నిమిషాలకు జాతీయ పతాకావిష్కరణ చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



మాగనూర్‌లో..

ఆశాలపై కక్ష సాధింపు సరికాదు



మాగనూర్‌లో డాక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు



కర్నిలో డాక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

మక్తల్: గ్రామాల్లో పని చేస్తున్న ఆశావర్కర్లకు పరీక్ష నిర్వహించే విధానం ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ మండల కన్వీనర్ గోవిందరాజులు అన్నారు. అనంతరం ఆయన ఆశావర్కర్లతో కలిసి డాక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో, పట్టణాల్లో గర్భిణులు, పిల్లలకు అనేక సేవలందిస్తూ ప్రభుత్వ అందించే వ్యాక్సినేషన్ కార్యక్రమంలో టీబీ, సర్వే, లెప్రసి, బీపీలో విధులు నిర్వహిస్తున్న ఆశాలపై ప్రభుత్వ వైఖరి మారాలన్నారు. వారికి పనికి తగిన పారితోషికం అందట్లేదని వాపోయారు. కార్యక్రమలో ఆశావర్కర్లు గోవిందమ్మ, సుజాత, లక్ష్మి, ఇందిరమ్మ, సావిత్రమ్మ, అనిత, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మాగనూర్: ఆశాలకు పరీక్ష నిర్వహించే ఆలోచనలను ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా కో కన్వీనర్ పుంజనూర్ అంజనేయులు అన్నారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశా కార్యకర్తలతో కలిసి డాక్టర్ నాగజ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15, 20 ఏళ్లుగా ఆశా కార్యకర్తలు ప్రజలకు అనేక సేవలు చేస్తున్నారని, ఇప్పుడు పరీక్ష పేరుతో వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. సరైన పారితోషకం ఇవ్వకుండా ఆశాలను శ్రమ దోపిడి గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పారిజాత, సారిక, రేణుక, ఆశమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



పాల ఉట్ల కంభం దింపుతున్న భక్తులు

మాగనూర్: మండల కేంద్రంలో వెలసిన నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శనివారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కలిసి పాల ఉట్లను కిందకు దింపి స్వామివారి ఆలయంలో భద్రపర్చారు. అంతకుముందు స్వామివారి పవ, రథోత్సవాన్ని ఆలయంలోకి తీసుకెళ్లారు. పూజల్లో గ్రామస్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వాకిటి వాబయ్య మాట్లాడుతూ.. నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు గత నెల 18వ తేదీన ప్రారంభమైందన్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు వివిధ ప్రాతాల నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారని తెలిపారు. జాతర ముగింపు సందర్భంగా నూతన ఆలయ కమిటీ ఎన్నుకోవాల్సి ఉన్న కొన్ని అనివార్య కారణాలతో అదే కమిటీని కొనసాగించారు.

కనులపండువగా హనుమాన్ జయంతి



శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ప్రజాప్రతినిధులు

ఆత్మకూర్: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆత్మకూర్‌లోని నేతాజీనగర్‌లోని హనుమాన్ మందిర్‌లో ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి జరిగిన పూజలు, శోభయాత్రలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, రాష్ట్ర గీతకార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్, చైర్‌పర్సన్ గాయత్రిరవికుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పిన్నంచర్ల గోవిందస్వామి కుమారులు బంగారు భాస్కర్, ప్రకాష్, రవికుమార్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఎన్ఆర్ యువసేన ఆధ్వర్యంలో రాత్రి ఆత్మకూర్ పట్టణ పురవీధుల గుండా భారీ హనుమాన్ విగ్రహంతో నిర్వహించిన శోభాయాత్ర కన్నులపండువగా కొనసాగింది.

పని చేసేవారికే సమాజంలో గుర్తింపు



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

మక్తల్: సమాజంలో పని చేసే వారికే గుర్తింపు ఉంటుందని కాంప్లెక్స్ జీహెచ్‌ఎం అనిల్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని లింగంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా మక్తల్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు చంద్రశేఖర్‌ను శాలువ, పూలమాలతో సన్మానించారు. చంద్రశేఖర్ విధి నిర్వహణలో అందరితో సౌమ్యంగా మెలిగారని కొనియాడారు. కార్యక్రమంలో వెంకట్రాములు, నాగర్జున, భీంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విరుపాక్షి, రవీందర్, లక్ష్మారెడ్డి, పరంధాములు పాల్గొన్నారు.